www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 19 నవంబర్ 2023
5
తిరుపతి



రోడ్లపై ప్లాస్టిక్ కనిపిస్తే జరిమానా

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ సమీర్ శర్మ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

ప్లాస్టిక్ ఉత్పత్తి పరిశ్రమలు తమ వస్తువులను వినియోగాదరుల వాడకం అనంతరం రీసైకిల్ కోసం తిరిగి సేకరణ బాధ్యత తీసుకోవాలని, రోడ్లపై, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ ప్లాస్టిక్ వేస్ట్, బాటిల్స్ కనపడరాదని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ సమీర్ శర్మ అన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక శ్రీపద్మావతి అతిధి గృహంలో ఛైర్మన్ పిసిబి, జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి సమావేశంలో పాల్గొని పలు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ మాట్లాడుతూ రహదారుల్లో, రహదారుల పక్కన ప్లాస్టిక్ సంబంధిత బ్యాగ్‌లు, వస్తువులు, ప్రధానంగా బాటిల్స్ కనబడరాదని, నిర్లక్ష్యం వహిస్తే భారీ అపరాద రుసుములు సంబంధిత పరిశ్రమలే చెల్లించాలని, మునిసిపల్, పంచాయితీ అధికారులు దృష్టిపెట్టాలని అన్నారు. పరిశ్రమలు తమ ఉత్పత్తులను వినియోగం అనతరం రీ సైకిల్ విధానానికి సేకరించాల్సిన పూర్తి బాధ్యత ఉందని, ఈపీఆర్ అమలు చేయాలని చట్టం చెబుతున్నదని లేదంటే అపరాధ రుసుములు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు 165, ప్రైవేట్ ఆసుపత్రులు 834, పశువైద్యశాలలు 36 మొత్తం 1035కు పైగా వున్నాయని అన్నారు. బయోమెడికల్ వేస్ట్ రూల్స్ – 2016 తప్పనిసరి అమలు కావాలని, జిల్లాలో అనుమతి పొందిన బయో వేస్ట్ రీసైకిల్ కంపెనీ దారులు తప్పనిసరి సేకరణ సమయంలో క్యూఆర్ కోడ్, బ్లూటూత్ విధానంతోనే ఎంత బరువు వాడిన బయోవేస్ట్ తీసుకేలుతున్నది యాప్‌లో రోజువారి నమోదు జరగాలని సూచించారు.

తిరుపతి నగరపాలక వేస్ట్ మేనేజ్ మెంట్ సిస్టం బాగుందని, ప్రెసిడెన్సియల్ అవార్డు అందుకోవడం అభినదనీయమని, పోల్యుషన్ హాట్ స్పాట్లలో, ఈ మధ్య ఏర్పాటు చేసిన ఫ్లైలెఫ్ట్‌ల వద్ద ఎఇకమ్ సంస్థ ప్రతిపాదనలు తీసుకుని పచ్చదనం పెంచాలన్నారు. అమెజాన్, ఫ్లిప్ కార్ట్, స్విగ్గీ, జమాటో వంటి సంస్థలు సరఫరా చేసే ప్లాస్టిక్ వస్తువులు, పాల పంపిణీదారులు వారు సరఫారా చేసే పాల ప్యాకేట్స్ వేస్ట్ సంబంధిత వారే సేకరణ చేపట్టడానికి చర్యలు చేపట్టి అమలు చేయాలని ఈపిఆర్ అన్నది చట్టం చెబుతున్నదని అన్నారు. ప్రధానంగా సానిటరీ ఇన్స్‌పెక్టర్ ఎఎ బ్రాండ్ ప్లాస్టిక్, బాటిల్స్ వంటివి ఉంటాయో తెలుస్తుందని ప్రణాళికాబద్ధంగా సూచనలు ఇవ్వడం, సేకరణపై దష్టి పెట్టాలన్నారు. మల్టీ నేషన్ కంపినీలు కోక్, థమ్సప్ వంటి వినియోగం వివరాలు, రీ సైకిలింగ్‌కు సేకరించిన వివరాలు ఉండాలని, రీ సైక్లింగ్ స్థానిక సంస్థలకు ఇవ్వగలిగితే త్వరగా ప్రాసెస్ తెలుస్తుందని అన్నారు. వాహనాలకు సంబంధించి బైబ్యాక్ విధానంతో బ్యాటరీలు సేకరణ, ఆ- వేస్ట్ ఎలక్ట్రానిక్ సంస్థల వస్తువులు విడిభాగాలు మార్చే లెక్కలు, వాటి సేకరణ, రీసైక్లింగ్ వివరాలు వుండాలని సూచించారు. స్పందనలో కాలుష్యంపై అందిన అర్జీలు సకాలంలో పరిష్కారం కావాలన్నారు. ఇక శబ్ద కాలుష్యం, వాహన కాలుష్యం విషయంలో పోలీస్, పిసిబి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి వాహనదారులకు జరిమానాలు విధించాలని సూచించారు. తిరుపతి నగరపాలక సంస్థలో అమలవుతున్న వేస్ట్ మేమేజ్‌మెంట్ విధానంపై నగరపాలక డిసి చంద్రమౌళీశ్వర రెడ్డి వివరించారు. ఈసమీక్షలో పిసిబి కర్నూల్ జాయింట్ కమిషనర్ రమేష్, పిసిబి ఈఈ నరేంద్ర, ప్రధాన ఆసుపత్రుల ప్రతినిధులు, ప్లాస్టిక్ ఉత్పత్తి దారులు, ప్లాసిట్‌తో ముడిపడివున్న డ్రింక్స్ సంస్థల, అనుమతి పొందివున్న రీసైకిల్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



పట్టణాల్లో పర్యావరణ పరిరక్షణ పెంపొందించాలని జిల్లా అధికారులతో మాట్లాడుతున్న సమీర్ శర్మ

పర్మినెంట్ చేస్తారా...?

- సాకులు చెప్పడం సరా మామూలే.. - ఉద్యోగుల్లో ఆందోళన

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటి

రెగ్యులర్ పోస్టు ప్రతి సంస్థలో... ప్రతి విభాగంలో...ప్రతి క్యాడర్‌లో పనిచేసే కార్మికుడు కోరుకునే కోరిక. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌ల్లో పనిచేసే కార్మికులు సైతం భవిష్యత్తుల్లో ఎప్పుడైనా పర్మినెంట్ కాకపోదా? అనే లక్ష్యంతోనే పనిచేయడం పరిపాటే. కానీ అధికారంలోకి వచ్చే పాలకులు ఆశలు చూపి, ఊరించి ఊసడిస్తారే తప్ప, పర్మినెంట్ చేసిన దాఖలాలు చాలా తక్కువ. ఇటీవల జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల్లో ఆశలు చిగురించాయి. మరీ ముఖ్యంగా టిటిడి వంటి దార్మికసంస్థల్లో రెగ్యులర్ జరుగుతుందనే ఆశకు నీరు పోస్తూ బోర్డు సైతం నిర్ణయం తీసుకుంది. కానీ అది అమలవుతుందా అనేదే పెద్ద ప్రశ్న. ఉద్యోగుల్లో సైతం ఆందోళన నెలకొనడం గమనార్హం.

పర్మినెంట్.. పర్మినెంట్.. రెగ్యులరైజేషన్.. పదం ఏదైనా ఫలితం ఒకటే. టైమ్ స్కేల్, కనీస వేతనం వంటి డిమాండ్లపై కార్మికులు రాష్ట్రంలోనే కాదు, దేశ వ్యాప్తంగా శతాబ్దాలుగా అనేక పోరాటాలు నడుస్తూనే ఉన్నాయి. కొంత వరకు విజయం సాధించారు. బూర్జువ రాజకీయ పాలకుల వల్ల పూర్తిస్థాయిలో కార్మికులకు న్యాయం జరగడం లేదు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు మరీ దారుణంగా తయారయ్యాయి. పర్మినెంట్ కథ దేవుడెరుగు ఉన్న హక్కులను సైతం నిర్వీర్యం చేసి, కార్మికులు శ్రమను దోచుకుని, కార్పొరేట్ శక్తులకు పంచిపెట్టడమే పనిగా దేశ పాలకులు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి తరుణంలో నిత్యం ప్రతి రాష్ట్రంలోనూ ఆందోళనను, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా రాష్ట్రంలో అంగన్‌వాడీలు, హెల్పర్లు సైతం తమకు కనీస వేతనాలు అమలు చేయాలని, పాలకులు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు వేతనం అదనంగా ఇవ్వాలని, మినీ వర్కర్లను, మెయిన్ వర్కర్లగా గుర్తించాలని పోరుబాట పట్టారు. డిసెంబర్‌లో సమ్మె చేసేందుకు నోటీసులు సైతం ఇచ్చారు. ఇటీవలే రాష్ట్ర మంత్రి వర్గం సమావేశమై రాష్ట్రంలోని కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని నిర్ణయించి జీవో నెంబరు 144ను విడుదల చేశారు. అందుకు షరత్తులు సైతం పెట్టారు. ఆ జీవో కాపీలు ఆయా జిల్లా అధికార యంత్రానికి ఇప్పటి వరకు అందిన దాఖలాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో టిటిడి కూడా బోర్డు తీర్మానం చేసింది. టిటిడిలో జీవో నెంబరు 144ను అమలు చేయాలని, దేవస్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను (2014కు ముందు నుంచి పనిచేస్తున్న వారు) రెగ్యులర్ చేయాలని నిర్ణయించారు. ఆమేరకు టిటిడిలోని అన్ని విభాగాలకు సర్కులర్ సైతం జారీ చేశారు. కానీ కొన్ని విభాగాల్లో ఈ జీవోను పట్టించుకోవడం లేదు. దేవుడు వరం ఇచ్చిన పూజారి వరం ఇవ్వడన్న చందాగా తయారైంది స్విమ్స్ పరిస్థితి. స్విమ్స్ వంటి ఆసుపత్రి సైతం ఈ జీవో తమకు వర్తించదని, అక్కడ అధికారులే బహిరంగంగా చెప్పి, కార్మికులకు తామే ఏమి చేయలేమని చేతులు ఎత్తేయడం గమనార్హం. బోర్డు తీర్మానంతో కార్మికులకు ఆశలు చిగురించాయి. కానీ జరుగుతున్న పరిణమాలు చూస్తే బోర్డు తీర్మానాన్ని అధికారులు అమలు చేస్తారా అన్నది ప్రశ్న. బోర్డు నిర్ణయాన్ని షరత్తులు జోడించడంతో ప్రస్తుతం ఉన్న కార్మికుల్లో కనీసం 10శాతం కూడా అందుకు అర్హులు కారేమో అన్న అనుమానం కార్మికుల్లో రేకెత్తింది. నిజంగా కార్మికులపై ప్రేమతో ఇదంతా చేస్తున్నారు. లేక త్వరలో జరుగబోవు సాదారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టిటిడి ఉద్యోగులు, కార్మికులు ఓట్ల కోసం రాజకీమాలు చేస్తున్నారా అన్నది పెద్దప్రశ్న. వాస్తవానికి అనుభవం, అర్హత ఉన్న వారిని రెగ్యులర్ చేయాలని బావిస్తే దశాబ్దాలుగా శేషచల అడవుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తూన్న అటవీ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీసం టైమ్‌స్కేల్ వర్తింప చేయాలని డిమాండుతో కార్మికులు 1127 రోజులుగా నిరసన దీక్ష చేస్తుంటే పట్టించుకోవడం లేదు. వీరిని రెగ్యులర్ చేయాలనే గతంలో అనేక సార్లు బోర్డు తీర్మానాలు జరిగాయి. కానీ అమలు కాలేదు. తాజా ఈవో కూడా వీరికి అమలు చేసినట్లే ఉంటుందా అని కార్మికుల్లో అనుమానం రేకెత్తింది. పర్మినెంట్‌పై ఆశపెట్టుకున్న కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పర్మినెంట్ అన్నదాన్ని ఎన్నికల స్టంట్‌గా కాకుండా కార్మికుల డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని అమలు చేయాల్సి ఉంది. రెగ్యులర్ చేయకున్నా సాకులు చెప్ప కుండా కనీసం టైమ్ స్కేల్ అన్నా వర్తింప చేయాలని కార్మికులందరూ కోరుకుంటున్నారు. ఆ దిశగా టిటిడి అధికార యంత్రాంగం చర్యలు తీసుకుని, కార్మికులకు న్యాయం చేస్తుందేమో వేచి చూద్దాం.

విద్యావకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



అందుబాటులో ఉన్న విద్యావాకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెషర్ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఐఐటీలో శనివారం నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్, ఉల్లాస్ ట్రస్ట్ సహకారంతో ఓపెన్ స్కూల్ డేని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల నుండి సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథి సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలు, స్కాలర్‌షిప్‌ల గురించి తెలియచేశారు. అనంతరం ఫిజిక్స్, కెమిస్ట్రీ, సైన్స్ ప్రయోగాలను దృశ్య, ఆచరణాత్మక అంశాలతో ప్రదర్శించి విద్యార్థులను ఉత్రూతలూగించారు. తదనంతరం ఐఐటీలోని అత్యాధునిక సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను వీక్షించారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎన్ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ఫ్యాకల్టీ అడ్వైజర్ దేబాశిష్ మోండల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీగా దొంగ ఓట్లు నమోదు

తక్షణమే తొలగించాలని కలెక్టర్‌కు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో వైసీపీ ప్రభుత్వం భారీగా దొంగఓట్లు నమోదు చేసిందని, వాటిని వెంటనే ఓటర్ల జాబితానికి తొలగించాలని శనివారం టిడిపి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతిలో వైసీపీ నాయకులు ఆంధ్రప్రదేశ్ రావాల్సిన ఆర్థిక వనరులైన ఇసుక, యర్రమట్టి, గ్రానెట్స్ దొంగిలించి ఇతర రాష్ట్రాలకి అమ్ముతున్నారని ఆరోపించారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 17,000 దొంగ ఓట్లు చేర్చారని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నరసింహ యాదవ్, గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, వెంకటగిరి మాజీఎమ్మెల్యే రామకష్ణ శ్రీకాళహస్తి నాయకులు సుధీర్ రెడ్డి, సుగుణమ్మ, పరసారత్నం, పులుగోరు మురళి కృష్ణరెడ్డి, జి.కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

దళితుల పైన దాడులు ఆపాలి: కాంగ్రెస్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

: దళితుల పైన దాడులు ఆపాలని కోరుతూ శనివారం తిరుపతి నగర కాంగ్రెస్ అధ్యక్షులు యార్లపల్లి గోపి ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌గాంధీ విగ్రహం దగ్గర ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ బొంతా మహేంద్ర మరణం ప్రభుత్వ దుర్మార్గమని డాక్టర్ సుధాకర్ మరణం ప్రభుత్వ వేధింపులే కారణమని అన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలలో దళితులకు వైసీపీ ప్రభుత్వం చేసింది శూన్యమని, దళితులకు స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్ ఫీజులు, మెస్ బిల్లులు దాదాపు ఆగిపోయాయని అన్నారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా దళిత గిరిజన నిరుద్యోగులకు అందించిన సాయం ఏమీ లేదని ఎద్దేవా చేశారు. దళితులకు అసైన్డ్, డీకేటి భూములను అన్యాయంగా స్వాధీనం చేసుకోవడం దారుణమని, వెంటనే ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇచ్చిన భూములను వెంటనే తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పూతలపట్టు ప్రభాకర్, మించల తేదోవతి, శాంతి యాదవ్, లీగల్ సెల్ ఛైర్మన్ రవి, సమీరుల్లా, ఎన్ఎస్‌యుఐ సిటీ అధ్యక్షులు జావేద్, నాగరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం: టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన పంచమి తీర్థం విశిష్టతను పురస్కరించుకొని అన్ని శాఖల సమన్వయంతో చివరి ఘట్టాన్ని విజయవంతంగా నిర్వహించగలిగామని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. శ్రీపద్మావతి అమ్మవారి పంచమితీర్థం సందర్భంగా తిరుచానూరులోని పద్మసరోవరానికి అశేష సంఖ్యలో భక్తులు తరలి వస్తారని, భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసింది. శాస్త్రోక్తంగా నిర్వహించే పంచమితీర్థ వేడుకలను భక్తులు వీక్షించేలా టీటీడీ ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసింది. సుదూర ప్రాంతాల నుండి పంచమి తీర్థం ఘట్టాన్ని వీక్షించి, పుణ్యస్నానలను ఆచరించే భక్తుల కోసం వాహనాల పార్కింగ్, క్యూలైన్లను పకడ్బందీగా అధికారులు ఏర్పాటు చేశారు. దాదాపు 50వేల మంది భక్తులు పంచమితీర్థం సందర్భంగా పద్మసరోవరంలో పుణ్యస్నానాలను ఆచరించారని టీటీడీ అధికారులు తెలిపారు. పంచమితీర్థం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నుండి అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మావతి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి, చక్రత్తాళ్వార్‌లకు స్నపన తిరుమంజనం అనంతరం 12 నుండి 12.10గంటల మధ్యకాలంలో చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహించారు. టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి పర్యవేక్షణలో శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా జరిగాయని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. పంచమీ తీర్థం సందర్భంగా తిరుమల శ్రీవారి కానుకగా రూ.2.5కోట్లు విలువైన 5కిలోల బరువు గల బంగారు కాసులమాల, శ్రీసుందరరాజస్వామి వారికి యజ్ఞోపవీతాన్ని సారెతో పాటు తిరుపతి పురవీధులలో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించారు.

అన్నదానం చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డి

ఆకట్టుకున్న పుష్ప అలంకరణ...

పంచమితీర్థం సందర్భంగా పంచమి మండపాన్ని ఒక టన్ను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఇందులో తామర పూలు, రోజాలు, లిల్లీలు తదితర 6 రకాల, కట్ ఫ్లవర్స్, 6 రకాల సంప్రదాయ పుష్పాలతో ఉద్యానవన సిబ్బంది అత్యంత సుందరంగా అలంకరించి తీర్చిదిద్దారు. ఈ పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

అన్నదానం చేసిన రామచంద్రారెడ్డి...

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తిరుచానూరు గ్రామపంచాయతీ సర్పంచ్ కీరకట్టు రామచంద్రారెడ్డి నేతత్వంలో పంచమితీర్థం సందర్భంగా వచ్చే భక్తులకు ఎక్కడ అన్న పానీయాలకు ఇబ్బందులు ఎదుర్కోకుండా తన సొంత నిధులను ఖర్చు చేసి దాదాపు 42 వేల మందికి అల్పాహారంతో పాటు అన్నదానం చేశారు. ఈ అన్నదానం కార్యక్రమాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచి రామచంద్రారెడ్డి గత తొమ్మిది సంవత్సరాలుగా అమ్మవారి బ్రహ్మోత్సవాలకు భక్తులకు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందని, శుక్రవారం రాత్రి 7వేల మంది భక్తులకు అల్పాహారం, 10 వేల మందికి శనివారం ఉదయం అల్పాహారంతో పాటు 25వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, బోర్డు సభ్యులు, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌వో నరసింహ కిషోర్, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్ కుమార్, సీఈ నాగేశ్వరరావు, డెప్యూటీ ఈవోలు గోవిందరాజన్, లోకనాథం, సర్పంచ్ కె.రామచంద్రరెడ్డి, శివాలయం ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, ఇతర అధికారులు భక్తులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై ఊరేగిన పద్మావతి అమ్మవారు

రాత్రి 9:30 గంటలకు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో తొమ్మిది రోజులపాటు జరిగిన అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి 7:30 గంటలకు అమ్మవారు బంగారు తిరుచ్చిలో ఆలయ నాలుగు మాడవీధులు విహరించి భక్తులను కటాక్షించారు. రాత్రి 9.30 గంటలకు ధ్వజావరోహణ ఘట్టం నిర్వహించనున్నారు. గజపటాన్ని అవనతం చేసి ధ్వజారోహణం నాడు ఆహ్వానించిన సకల దేవతలను సాగనంపడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం అవుతాయి. బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకునే వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమద్ధితో తులతూగుతారని ఐతిహ్యం. విషమత్యు నాశనం, రాజ్యపదవులవంటి సకల శ్రేయస్సులు పొందుతారని విశ్వాసం. జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈఓ రమేష్, వీజీవో బాలిరెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



శోభాయమానంగా పద్మావతి అమ్మవారి పంచమి తీర్థం

శ్రీవారి ఆలయం నుంచి శ్రీ పద్మావతి అమ్మవారికి సారె

రూ.2.5 కోట్లు విలువైన 5 కిలోల బంగారు కాసులమాల, యజ్ఞోపవీతం సమర్పణ



ప్రజాశక్తి- తిరుమల: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం పంచమితీర్థం ఉత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. ప్రతి ఏటా పంచమితీర్థం రోజున తిరుమల నుంచి సారె తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమలలో ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తిరుచానూరు పద్మావతి అమ్మవారి పంచమితీతం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో సంప్రదాయబద్ధంగా సారె ఊరేగింపు మొదలైందని తెలిపారు. ఈ సారె ఊరేగింపుగా కాలినడకన తిరుపతిలోని అలిపిరి, కోమలమ్మ సత్రం, తిరుచానూరు పసుపు మండపం మీదగా శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకుంటుందని చెప్పారు. తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు పద్మసరోవరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారని తెలియజేశారు. ఈకార్యక్రమాన్ని టీటీడీ నియమనిష్టలతో భక్తిశ్రద్ధలతో అద్భుతంగా నిర్వహిస్తోందని చెప్పారు. ఈవో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయం నుండి రూ.2.5 కోట్లు విలువైన 5 కిలోల బరువు గల బంగారు కాసులమాల, యజ్ఞోపవీతం అమ్మవారికి కానుకగా సమర్పిస్తున్నట్టు తెలియజేశారు. ముందుగా శ్రీవారి ఆలయంలో ఉదయం 2.30 నుండి పరిమళాన్ని (నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన మిశ్రమం) విమాన ప్రాకారంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం శ్రీవారి వక్షఃస్థల లక్ష్మీ అమ్మవారికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. ఆ తరువాత ఉదయం 4.30గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణంతో కూడిన సారె ఊరేగింపు మొదలైంది. ఈ సారెను గజాలపై ఆలయ నాలుగు మాడ వీధుల గుండా ఊరేగించి అనంతరం కాలినడకన తిరుమల నుంచి తిరుపతిలోని అలిపిరి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ఈవో ఎవి.ధర్మారెడ్డి ఆభరణాలతో కూడిన శ్రీవారి సారెను జెఈవో శ్రీ వీరబ్రహ్మంకు అందజేశారు. అక్కడినుండి కోమలమ్మ సత్రం, శ్రీకోదండ రామాలయం, శ్రీ గోవిందరాజ స్వామి ఆలయం, లక్ష్మీపురం సర్కిల్, శిల్పారామం నుండి తిరుచానూరు పసుపు మండపం వద్దకు సారె చేరుకుంది. అక్కడ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ఆలయ మాడవీధుల గుండా ప్రదక్షిణగా వెళ్లి పద్మపుష్కరిణిలో అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

పడవలొదిలి నిరసన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిపై టీడీపీ- జనసేన పార్టీలు వినూత్న రీతిలో నిరసన తెలిపాయి. ఆ పార్టీ అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు పిలుపు మేరకు శనివారం పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ, దక్షిణ కైలాసగిరి కాలనీ, తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ గ్రామాల్లో పర్యటించి డిజిటల్ క్యాంపెయిన్ నిర్వహించారు. వర్షపు నీరు నిల్వ చేరిన గుంతల్లో పడవలు వదిలి జగనన్న ఇదేనా నీ అభివద్ధి అంటూ ఎద్దేవా చేశారు. గుంతల రోడ్ల చిత్రాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో 'గుంతల రాజ్యం ఏపీ', 'వ ఏపీ హేట్స్ జగన్' పేరిట హాష్ టాగ్‌లతో నిరసన తెలియజేశారు. జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కోట వినుత, టీడీపీ తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 24న అశ్ర జాతీయ సమ్మిట్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వస్తు కొనుగోలు విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలనీ, నగదు చెల్లింపు విషయంలో జవాబుదారితనం ఉండేలా బిల్లులు తీసుకోవాలని అశ్రా, కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తిరుపతి జిల్లా అధ్యక్షులు అరికింబేడు మునిశేఖర్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 24వ తేదీన ఢిల్లీలో జరిగే అశ్ర 5వ జాతీయ సమ్మిట్ గోడపత్రికను స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు.

డిసెంబర్ 10న

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ

బొప్పరాజు వెంకటేశ్వర్లు వెల్లడి

సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : రాష్ట్రంలో ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారార్థం ఏర్పడిన అసోసియేషన్, ప్రథమ మహాసభ విజయవాడలో జరుగుతుందని ఏపీ అమరావతి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. తిరుపతి నగరంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏపీజెఎసి అమరావతి అనుబంధంగా 2018లో ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ఏర్పాడిందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వసంస్థల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రథమ మహాసభ డిసెంబర్ 10వ తేదీన విజయవాడలోని జింఖానా మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈమహాసభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభ అనంతరం రాష్ట్రస్థాయి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి మిట్టపల్లి అశోక్ రెడ్డి, శివప్రసాద్, శ్యామ్ ప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవల్లో సిబ్బంది ప్రధాన పాత్ర పోషించాలి

పిహెచ్‌సి వైద్యాధికారి చైతన్య

రోగులకు వైద్యం అందిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : వైద్య ఆరోగ్యశాఖ ఆరోగ్య సిబ్బంది ప్రజారోగ్య సేవ లు అందించడంలో ప్రధాన పాత్ర పోషించాలని దొర వారిసత్రం పిహెచ్‌సి వైద్యాధికారి చైతన్య సూచించారు. వెదురుపట్టు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేజ్ డాక్టర్ క్లినిక్ (104) వైద్య శిబిరంలో పలువురు రోగులను పరీక్షించి మందులు అందించారు. మధుమేహం, రక్తపోటు కలిగిన వ్యాధిగ్రస్తులకు పరీక్షల ద్వారా వ్యాధి స్థాయిని బట్టి ఆరోగ్య విద్యతోపాటు, నెలకు సరిపడ మందులు అందించారు. గర్భిణులను పరీక్షించి సుఖ ప్రసవం కోసం ఏదైనా ఆసుపత్రిని ఎంపిక చేసుకోవాలన్నారు. అనంతరం దుప్పల వారి కండ్రికలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆ గ్రామంలో ఉన్న బాలింతలకు పలు ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు 45 రోజుల్లోపు విధిగా ఏడు పర్యాయాలు సందర్శించి వారి ఆరోగ్య స్థితిని పరిశీలించి, ఆరోగ్య సూచనలు ఇవ్వాలని వైద్యాధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ గోపి కిరణ్, ఎంఎల్‌హెచ్‌పి పావని, ఏఎన్ఎం అమరావతి, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఆశ కార్యకర్తలు సుగుణ, ప్రభ కుమారి, డిఈఓ శివ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఇఓ రవీంద్రనాథ్

పాఠశాలల్లో వసతుల పరిశీలన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో శనివారం ఉదయం మండల విద్యాశాఖ అధికారి కే రవీంద్రనాథ్ పలు పాఠశాలలను పరిశీలించారు. మొదట తలారిపేట్టు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థుల చదువును వారి కనీస వసతుల గురించి, మధ్యాహ్న భోజన పథకాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్టీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో పర్యటించి విద్యార్థులు చదువు ఏ స్థాయిలో వుందో విద్యార్థిని విద్యార్థులను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. వారి రోజువారి హోంవర్క్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రోజువారి హోంవర్క్ ఇచ్చి ఉదయం పాఠశాలకు వచ్చేటప్పుడు కచ్చితంగా చేసుకొని రావాలని, అందుకు తల్లిదండ్రులే బాధ్యత వహించాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో మాత్రమే క్రమశిక్షణతో కూడిన చదువును నేర్పించడమే కాకుండా మిగిలిన సమయంలో విద్యార్థిని విద్యార్థుల చదువు సంధ్యల విషయం తల్లిదండ్రులు పూర్తిగా బాధ్యత వహించాలన్నారు. అనంతరం కరకంబట్టు గ్రామ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు జగనన్న కానుక కిట్లు తో వస్తున్నారా? లేదా? ఇచ్చారా అడిగి తెలుసుకుని అనంతరం స్కూల్ రికార్డుల, మధ్యాహ్న భోజన మెనూ కొన్నిటి పరిశీలించారు. విద్యార్థుల పట్ల ఎలా నడుచుకోవాలో ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డికి టిడిపి నాయకుల నివాళి

టిడిపి కార్యకర్త భౌతిక దేహానికి నివాళులర్పిస్తున్న పులివర్తి నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని అనుపల్లి పంచాయతీ రేఖలచేను గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కొర్లకుంట వెంకట రెడ్డి గుండె పోటుతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని శనివారం పార్టీ నాయకులతో కలిసి కొర్లకుంట వెంకటరెడ్డి భౌతిక దేహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని తెలిపారు. సాయంత్రం మూడు గంటలకు తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు ఎద్దల చంద్రశేఖర్ రెడ్డిలు వెంకటరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం తిరుమలరెడ్డి, కే నరసింహారెడ్డి, ఈ ఉమాపతి నాయుడు, , వెంకటేష్, నాయుడు, బండి విజయ్ కుమార్ రెడ్డి, జవాది ప్రకాష్, లీలా రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైసిపి వెంకటగిరి సమన్వయకర్త రాంకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని అమ్మపాలెం గ్రామ మాజీ సర్పంచ్ మస్తాన్ రెడ్డి కుటుంబాన్ని శనివారం రాంకుమార్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమా దానికి గురై తలకి బలమైన గాయం తగల డంతో మాజీ సర్పంచ్ ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనితో వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త అమ్మపాలెం గ్రామానికి వెళ్లి వారిని పరామర్శించి ఓదార్చారు. అధైర్య పడకూడదని ఉండాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ కే శ్రీనివాసులు రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు సుబ్బరామయ్య, సదానంద రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ చంద్రశేఖర్, రాజారెడ్డి పాల్గొన్నారు.

కార్గో సేవల మాసోత్సవాల అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - సత్యవేడు: ఆర్టీసీ సంస్థ అందిస్తున్న ఉచిత కొరియర్ డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా సత్యవేడు ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటరమణ కోరారు. కార్గో సేవల మాసోత్సవాలను పురస్కరించుకొని శనివారం సత్యవేడు పట్టణంలో డిపో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ కార్గో సేవలను ప్రజలు మరింత చేరువగా తెచ్చేందుకు డోర్ డెలివరీ సౌకర్యాన్ని అందు బాటులోకి తీసుకొచ్చిందని 50 కేజీల బరువుతో బుకింగ్ చేసిన పార్సిల్, కొరియర్‌ను ఇంటి వద్దకే చేరుస్తామన్నారు. ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్గోలో అవగాహన కల్పించారు. కరపత్రాలను ఆర్టీసీ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి ఆర్ మూర్తి, డిఎన్ వర్మ, ఏఎంయూ శ్రీనివాసులు, డిపో సెక్రటరీలు ఎన్ బాబు, వెంకటేశ్వర్లు, ఎస్ ఎన్ బాబు, ఆర్ జయ కుమార్, గ్యారేజ్ సెక్రెటరీ శేఖర్ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన ఆధ్వర్యంలో

'గుంతల ఆంధ్రకి దారేది?'

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం ఆంధ్ర తమిళనాడు సరిహద్దులో టిడిపి, జనసేన ఉమ్మడిగా కలిసి 'గుంతల ఆంధ్రకి దారి ఎక్కడ?' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం జనసేన ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు సురేందర్ కుమార్, మాజీ ఎమ్మెల్యే హేమలత, సత్యవేడు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ లావణ్య కుమార్, జనసేన రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి ఆధ్వర్యంలో నిర్వహించారు.

దళితులపై దాడులను ఖండించాలి

కోటలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి -కోట : గోదావరి జిల్లాలో దళితుడైన బొంతా మహేంద్ర పై జరిగిన దారుణమైన సంఘటన వైసిపి అరాచక పాలనకు నిదర్శనమని కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు కర్లపూడి సుధా అన్నారు. శనివారం కోట మండలంలోని తహశీల్దారు కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ బోంతా మహేంద్ర కు జరిగిన అన్యాయంపై రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు స్పందించాయని, ఇందులో భాగంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఆదేశాల మేరకు కర్లపూడి సుధా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అంతే కాకుండా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు ప్రతి చోటా జరుగుతూనే ఉన్నాయన్నారు. దళితులపై అన్యాయంగా అక్రమ కేసులు బనాయించి వైసీపీ ప్రభుత్వం దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందని, ఇందుకు గతంలో జరిగిన డాక్టర్ సుధాకర్ మరణానికి ప్రభుత్వ వేధింపులే సాక్ష్యం అని గుర్తు చేశారు. గత నాలుగున్నర సంవత్సరాలలో దళితులకు వైసీపీ ప్రభుత్వం చేసిందేమి లేదని అంతా శూన్యం అన్నారు. దళిత విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఎస్సీ, ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ల ద్వారా దళిత గిరిజన నిరుద్యోగులకు అందాల్సిన సాయం వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. దళితులకు నిర్మించవలసిన ఇళ్లు ఆనవాళ్లే లేకుండా చేశారని అన్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను ఈ వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా స్వాధీనం చేసుకోవడం దుర్మార్గం అని ఫలితంగా ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంద న్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం ఆనాడు దళితులకు ఇచ్చిన భూములను వెంటనే తిరిగి దళితులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్త లు పాల్గొన్నారు.

వెంకటగిరి: వైసిపి ప్రభుత్వం సామాజిక బస్సు యాత్ర ఎందుకు చేస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పంట శ్రీనివాసులు రెడ్డి ప్రశ్నించారు. వెంకటగిరిలో దళితులపై దాడికి నిరసనగా ర్యాలీ లో పాల్గొని ఈ ప్రభుత్వాన్ని మీడియా ముఖంగా ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా గడిచిన నాలుగు సంవత్సరాలు ఏడు నెలలు ఏం సాధించారని దళితులపై దాడిలు తప్ప అని

వెంకటగిరిలో

నిలదీశారు. నాడు డాక్టర్ సుధాకర్ నుండి ఇప్పటి బొంతు మహేంద్ర వరకు దళిత యువకులను దళితులను వేధించి చంపడమే వారు చేస్తున్న సామాజిక బస్సు యాత్రకు నిదర్శమని పంట దళితులపై దాడిని ఖండించాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ హయాంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వారు ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తే నేడు ఆ కార్పొరేషన్లను ఇర్వీర్యం చేస్తున్నందుకు సామాజిక సామాజిక యాత్ర చేస్తున్నారా? అని ఎద్దేవా చేశారు. దళితులపై దాడులు హత్యలు ఆపాలని, హత్య రాజకీయాలకు స్వస్తి పలికి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కార్పొరేషన్ నిధులను దారి మళ్లించకుండా ఆ నిధులతో ఆర్థికంగా బలపడేందుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చెన్నయ్య, గూడూరు మండల కాంగ్రెస్ ప్రసిడెంట్ దర్శి నాగ భూషణం, వెంకటగిరి పట్టణ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కలపాటి శ్రీనివాస్ కాల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాకాలను అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డిదే..

- తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

మాట్లాడుతున్న తుడ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పాకాల: చంద్రగిరి నియోజకవర్గంలో పాకాల మండలానికి రూ.70 కోట్ల నిధులు విడుదల చేసి మండలంలోని ప్రతి పంచాయతీకి రెండు నుంచి మూడు కోట్లు నిధులు విడుదల చేసి అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిదేనని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లోకనాథం అధ్యక్షతనలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో తనకు ఇష్టమైన మండలాలు తిరుపతి రూరల్, పాకాల మండలం అని పాకాల మండలానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటా నన్నారు. రాజకీయంలో మొట్టమొదట అడుగు పెట్టినప్పుడు మొదటి ప్రచారం పాకాల నుంచి ప్రారంభం అయిందన్నారు. ప్రచారంలో పాకాల మండల ప్రజలు వారి కుటుంబ సభ్యుడిగా తనను ఎంతగానో ఆదరించిన అభిమానాన్ని ఎప్పటికీ మరిచి పోనన్నారు. పాకాల మండల రుణం తీర్చుకో వాలని ఎప్పు డూ ఆలోచిస్తానని తెలిపారు. మండలంలో మనం చేసిన అభివృద్ధి ఇంకొకసారి అధికారంలోకి తీసుకుని రావడా నికి అవకాశం వుందన్నారు. ప్రజా ప్రతినిధు లుగా ఎప్పుడూ ప్రజలతో కలిసి ఒక కుటుంబ సభ్యులుగా భావించి పెళ్లి వచ్చినప్పుడు పెళ్లి కానుకలు, పండుగలు వచ్చినప్పుడు కానుకలు, కరోనా సమ యంలో మండలం లోని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని వారికి మెడిసిన్స్, పళ్ళు, కూరగాయలు, బియ్యం, సరుకులు అందించా మన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన మంచి పనులను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయన్నారు. నాలుగు సంవ త్సరాలుగా కనబడని ప్రతిపక్షాలు అన్నీ ఇప్పుడు వచ్చి తాము ఏదో చేస్తామని అంటు న్నారని, కానీ మండలం లోని ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని ఆలోచిం చాలన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, సింగల్ విండో ఛైర్మన్ మునీశ్వర్ రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ లింగయ్య, ఎంపీపీ లోకనాథం, తహశీల్దారు భాగ్యలక్ష్మి, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.

శ్రీరామలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సన్నీ ఒపోటెక్ కంపెనీ వారు కళాశాలలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికలకు ఈ మూడు విభాగాలకు సంబంధించిన 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వీరికి ఒక్కొక్కరికి వార్షిక వేతనంగా 2.4 లక్షల రూపాయలను అందించనున్నామని కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ పి.కావ్య తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతను మరింతగా పెంపొం దించడానికి వివిధ కార్యక్రమాలను కళాశాల లో నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తు న్నామని తెలి పారు. కళాశాలలో విద్యార్థుల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన వివిధ సౌకర్యాలను ప్రతి విద్యార్థి వినియో గించుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షిస్తు న్నామన్నారు. ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలి పారు.

ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెంరామ సుబ్బా రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ మన్యం అరవింద్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, ప్లేస్మెంట్ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, కళాశాల వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం వాహనంలో కట్టెలు తరలింపు

ప్రజాశక్తి - బాలాయపల్లి: ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకు లు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వాహనా లు అందిస్తే ఆ వాహనాలలో కట్టెలు తోలుతూ కనిపించిన సంఘటన శనివారం మండలంలోని జయంపు గ్రామంలో చోటుచేసుకుంది. రేషన్ సరుకులు ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేసేందుకు నిరాకరిస్తున్న వాహన మిత్రలు కట్టెలు తోలుకునేందుకు ఉపయోగించుకోవడం దారుణమని, ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ కోసం సబ్సిడీపై వాహనాలను అందజేస్తే ఆ వాహనాలను కట్టెలు తోలు కునేందుకు ఉపయోగించుకోవడం దారుణమని జయంపు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తా: నాని

ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 2024 ఎన్నికల్లో చంద్రగిరి నియోజక వర్గంలో టిడిపి జెండా ఎగురవేయడం ఖాయమని, ప్రజా మద్దతుతో చంద్రగిరి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. శనివారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీలోని జయశంకర్ కాలనీలో 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి మినీ మేనిఫెస్టో వివరిస్తూ ప్రజలు తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కమిటీ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప, మండల మహిళా కార్యదర్శి మహేశ్వరి, ఉమ్మడి శెట్టిపల్లె పంచాయితీ టిడిపి అధ్యక్షులు ఈశ్వరయ్య, గోపీనాథ్, భాస్కర్ రెడ్డి, అజీస్ బాష, జనసేన నాయకులు సాయి, నవీన్ పాల్గొన్నారు.

భారత్- ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్ కోసం బిగ్‌స్క్రీన్

10 వేల మందికి తుమ్మలగుంట కేవీఎస్ క్రీడా మైదానంలో ఏర్పాట్లు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతిలో క్రికెట్ క్రీడాభిమానులకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి చిత్తూరు జిల్లా బాయ్స్, అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ వారు తీపి కబురు అందించారు. వరల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్- ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు అతిపెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర క్రీడా మైదానంలో ఆదివారం మధ్యాహ్నం 1 గంటల నుంచి మ్యాచ్ ముగిసేంత వరకు నిరంతరాయంగా ప్రత్యక్ష ప్రసారమయ్యేలా ఏర్పాట్లు చేశామన్నారు. సుమారు 12 అడుగుల ఎత్తు 36 అడుగుల వెడల్పు కలిగిన అతి పెద్ద స్క్రీన్‌లు, డీజే సౌండ్స్ అండ్ లైటింగ్ ఏర్పాటు చేశామని, ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్ ఫైనల్ పోటీలను అభిమానులు అందరూ ప్రశాంతంగా వీక్షించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సుమారు 7 నుంచి 10 వేల మంది ఒకే చోటు నుంచి క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. అంతేకాకుండా వచ్చిన క్రికెట్ అభిమానులు అందరికీ ఉచిత ప్రవేశం, రాత్రి భోజనం ఏర్పాటు చేశామన్నారు. ఈఅవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ఆనందంగా క్రికెట్ మ్యాచ్ వీక్షించాలని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ప్రకాశం పార్కులో బిగ్‌స్క్రీన్ ఏర్పాటు

తిరుపతిలో క్రికెట్ క్రీడాభిమానుల కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచకప్ ఫైనల్ పోటీలను వీక్షించేందుకు బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. ఇందుకు సంబంధించి ప్రకాశం పార్కులో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం రాత్రి కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రపంచ వరల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్ ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు అతిపెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రకాశం పార్కులో మధ్యాహ్నం ఒంటి గంటల నుంచి మ్యాచ్ ముగిసేంత వరకు ప్రత్యక్ష ప్రసారమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నమన్నారు. సుమారు 24 అడుగుల ఎత్తు 48 అడుగుల వెడల్పు కలిగిన అతిపెద్ద స్క్రీన్‌లు, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభిమానులు అందరూ వీక్షించేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పిస్తు న్నామని తెలిపారు. డీఈ విజయకుమార్ రెడ్డి ఉన్నారు.

ఇంటింటికీ టిడిపి నాయకుల ప్రచారం

టిడిపి నాయకులు భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న కదిరిమంగళం గ్రామస్తులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వడమాలపేట మండలంలోని కదిరిమంగళం పంచాయతీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కర పత్రాలు, బాండ్‌లు అందించి ప్రచారం చేసి, స్థానికులతో కలసి ప్రజావేదిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ రాక్షస, కక్ష పూరిత పాలనను వివరించి, భవిష్యత్తులో బాబు అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధి - సంక్షేమాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో విజన్ వున్న చంద్రబాబు గెలుపు తథ్యమన్నారు. టీడీపీ మేనిఫెస్టోను ఇంటింటికి తిరిగి వివరించారు. 'ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రసిడెం టు జానా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి హేమావతి, చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి ధనంజేయులు నాయుడు, బత్తెయ్య, పూర్ణచంద్ర, మునితేజ, మస్తాన్, ఉమాపతి, వెంకట్రామానాయుడు, సుబ్రమణ్యం నాయుడు, దొరబాబు, శివశంకర్, మునిశేఖర్, దాముయాదవ్, వెంకటేశ్వరరావు, ఉమాపతి, శేషాద్రియాదవ్, దొరస్వామి, అంజయ్య, పెద్దబ్బరాజు, శివ రాము పాల్గొన్నారు.

పుష్ప స్టీల్ కంపెనీ దాతృత్వం

ప్రజాశక్తి -ఏర్పేడు :మండలంలోని మేర్లపాక గ్రామ పంచాయతీలో కంపెనీ స్థాపన నుంచి మేర్లపాక గ్రామాన్ని అనేక అభివృద్ధి కార్యక్ర మాలతో పాటు, సమాజ సేవ చేయా లనే ఉద్దేశంతో సేవ కార్యక్రమాలను అవలంబిస్తున్నారు. ప్రతి సంవత్సరం దీపావళి సందర్భంగా అనేక అభివృద్ధి కార్యకలాపాలతో పాటు, ఉచిత వైద్య సేవతో పాటు ఈ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు సుమారు 150 మంది పిల్లలకు ప్లేట్లు, గ్లాసులు స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. కంపెనీ సీఈఓ బలరాంరెడ్డి ఆదేశానుసారం కంపెనీ పిఓ సాగర్ , సర్పంచ్ కే గంగాధర్ పంపిణీ చేశారు. సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ కంపెనీ ప్రారంభం నుంచి మన గ్రామానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల్ని ప్రతి సంవత్సరం కొనసాగిస్తున్నందుకు పుష్ప స్టీల్స్ ప్రైవేట్ కంపెనీ వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మన గ్రామానికి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ మన గ్రామాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళతారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేజీ గంగాధర్, ఏర్పేడు ఎంపిటిసి భరత్ కుమార్, మాజీ ఎంపీటీసీ కోటేశ్వరరావు, హరినాథ్ రెడ్డి, శంకరయ్య, కె. నాగరాజు, నేషనల్ హోం రేట్స్ కౌన్సిల్ శ్రీకాళహస్తి డివిజన్ ప్రసిడెంట్ మెరుం చంద్ర పాల్గొన్నారు.

పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించొచ్చు

ఫ్రెషర్స్‌డే వేడుకల్లో సిద్ధార్థ కళాశాలల ఛైర్మన్ అశోక్‌రాజు

ఫ్రెషర్స్‌డే వేడుకలు ప్రారంభిస్తున్న సిద్ధార్థ కళాశాల ఛైర్మన్ అశోక్‌రాజు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టుదలతో కృషిచేస్తే ఏదైనా సాధించొచ్చని సిద్ధార్థ కళాశాల ఛైర్మన్ అశోక్ రాజు పేర్కొన్నారు. పుత్తూరు లోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా కళాశాలల ఛైర్మన్ అశోకరాజు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఫ్రెషర్స్‌డే వేడుకలు ప్రార్థనా గీతంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోకరాజు మాట్లాడుతూ సిద్ధార్థ కళాశాలలను ఎంచుకొన్నందుకు విద్యార్థులకు శుభాభినందనలు తెలిపారు. డిప్లొమా, బీటెక్, ఎంటెక్, ఎంసిఏ ఎందులో చేరినా ఫ్రెషరీ విద్యార్థులు సంకల్ప బలంతో, పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించ వచ్చునని తెలిపారు. సీనియర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ రోల్ మోడల్‌గా దశ దిశ నిర్దేశించే విధంగా వారికి గైడెన్స్ ఇస్తూ ముందుకు నడిపించాలని కోరారు. కళాశాల డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విద్యార్థులు డెడికేషన్, కమిట్‌మెంట్, డిసిప్లన్ అంశాలపై దృష్టి సారిస్తే విజయాన్ని అందుకుంటారని తెలిపారు. దీన్ని క్రమశిక్షణగా తప్పకుండా పాటిస్తే అనుకున్న ధ్యేయాన్ని త్వరగా చేరుంటారని, అందరికి ఫ్రెషర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జూనియర్ అధ్యాపకులు మాట్లాడుతూ కళాశాలకు వచ్చిన మొదటిరోజే తడబడతామని తర్వాత సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులు మాపై చూపించిన అభిమానం, సోదర భావంతో నేడు అందరి ముందు మాట్లాడ గలుగుతున్నామని మరెంతో సాధిస్తామని నమ్మకం వచ్చింద న్నారు. అనంతరం విద్యార్థులు పాటలతో డ్యాన్స్‌తో సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్ జనార్ధన్ రాజు, చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్ సూర్య రాజు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని జెపిఎం వీధిలో శనివారం సాయంత్రం ఉదయప్రియ(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె వయసు 25 సంవత్సరాలు ఉంటుందని వివాహితురాలు అని రేణిగుంట పోలీసులు తెలిపారు. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తు న్నారు.

సృజనాత్మక కృత్యాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అలరించిన విద్యార్థుల సృజనాత్మక కృత్యాలు

ప్రజాశక్తి-తొట్టంబేడు: సృజనాత్మక కృత్యాలతో విద్యార్థులందరూ ఆనందంగా చదివి ఉల్లాసంగా ఎదగాలని దిగువ సాంబయ్య ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం అన్నారు. మూడవ శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్దులు అభినయ గేయాలు, కథా పఠనం, కాగితాలతో బొమ్మలు మాస్కులు తయారీ ప్రదర్శించారు. అనంతరం ధ్యాన ప్రక్రియ కొనసాగించారు. ఆట, పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాస్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట మండలం, కరకంబాడి, ఇందిరానగర్‌లలో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ కార్యాలయంలో రాస్ జన శిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు ఆదాయం పెంపునకు, స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ఉచిత ఆర్యా వర్క్, ఉచిత టైలరింగ్ శిక్షణను శనివారం ప్రారంభించారు. గతంలో టైలరింగ్ నేర్చుకున్న వారికి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి ద్వారా సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమానికి కెనరా బ్యాంక్, కరకంబాడి శాఖ సబ్ మేనేజర్, శివకుమార్ హాజరై రాస్ ద్వారా అందించే అన్ని శిక్షణా కార్యక్రమాలను పొంది, వ్యాపార పరంగా అభివృద్ధి చేసుకునే వారికి తమ బ్యాంకు ద్వారా కూడా రుణాలు అందిస్తామని, ఈ వృత్తి శిక్షణ కార్యక్రమాలు, కుటుంబాల ఆర్థిక అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం గా ఉంటుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థాన్ సంస్థ కో ఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి, ట్రస్టీలు నిత్య సుధా ,శ్యామల ట్రస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ గిరిప్రసాద్, అన్బలగన్, స్వాతి, శంకరయ్య, ఆనిమేటర్లు, క్లస్టర్ లీడర్లు పాల్గొన్నారు.

'మూడోసారి మనదే ప్రపంచ కప్'

భారత టీంకు వినూత్న మద్దతు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భారత క్రికెట్ టీం ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో మూడోసారి దేశానికి ప్రపంచ కప్పును మన దేశానికి మూడోసారి కూడా తీసుకురావాలని కోరుతూ తిరుపతి-కరకంబాడి మార్గంలోని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రపంచ కప్ ఆకృతిలో ఏర్పడి భారత క్రికెట్ టీంకు వినూత్న రీతిలో మద్దతు ఇస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 11 మంది సభ్యులు ఇంక చిత్రాలను, జెర్సీలను ధరించిన తీరు అందరిని విశేషంగా ఆకట్టుకుందని ఆ పాఠశాల అధినేత కేఎస్ వాసు తెలిపారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ప్రపంచకప్ క్రికెట్ పోటీలలో భారత టీం చాలా బలంగా కనిపిస్తోందని ఎదురొచ్చిన ప్రతి ప్రత్యర్థి టీంను ఓడించుకుంటూ వరుసగా పది మ్యాచ్‌లు గెలవడం గర్వకారణంగా ఉందన్నారు. ఫైనల్ మ్యాచ్‌లోనూ బలమైన ఆస్ట్రేలియా టీంను ఓడించి ముచ్చటగా మూడోసారి ప్రపంచకప్ ను భారతదేశానికి అందిస్తుందని ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెఆర్ అనురాధ గోపాల్, హెచ్ఎం ప్రమీల కృష్ణన్, ఏవో చంద్రశేఖర్, పీఆర్వో సాంబశివారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21న సీఎం పర్యటనను విజయవంతం చేయండి: ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 21వ తేదీన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సూళ్లూరుపేటకు రానున్నారని, నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో లబ్ధిదారులు, ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి పిలుపు నిచ్చారు. గూడూరులోని సొసైటీ ప్రాంతంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలోఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ సూళ్ళూరుపేటలో ఈనెల 21వ తేదీన జరగనున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. పులికాట్ ముఖద్వారం ప్రారంభించాలని తాను ఎంపిగా ఉన్నప్పుడు టిడిపి ప్రభుత్వాన్ని కోరామని, వారు పట్టించుకోలేదన్నారు. అయితే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముఖద్వారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. నియోజకవర్గం నుండి 200 బస్సులు ఏర్పాటు చేశామని, ముఖ్యమంత్రి సభకు అధిక సంఖ్యలో ప్రజలు, లబ్ధిదారులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడారు. ఈ సమావేశంలో వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయ్ కుమార్, జడ్పీటీసీ యామిని, మన్నెం శ్రీనివాసులు, పార్టీ నాయకులు బోమిడి శ్రీనివాసులు, కోడూరు మీరారెడ్డి, అజీజ్ ఖాన్, సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అకాడమిక్ ఆడిట్

ప్రజాశక్తి-పాకాల: కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకాడమిక్ ఆడిట్ నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిదీర్ భాష అధ్యక్షతన అకాడమిక్ అడ్వైజర్స్ చిత్తూరు సావిత్రమ్మ కళాశాల నుండి డాక్టర్ రాజ్యలక్ష్మి పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి మురళీమోహన్ రెడ్డిలు ఈ ఆడిట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐక్యు ఏసి కోఆర్డినేటర్ రమేష్ కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ ఈశ్వర బాబు,వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు మాస్లామని, మోహన్ బెహరా,చిట్టి కళావతి,మాధవి, ఆదిశంకర్ రెడ్డి, రమణమ్మ పాల్గొన్నారు.

అదుపు తప్పి ద్విచక్రవాహనదారుడికి గాయాలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని సూళ్లూరుపేట రోడ్డు మతకముడి రోడ్డు దగ్గర ద్విచక్రవాహన దారుడు అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్రగాయమయింది. శ్రీకాళహస్తి మండలం తొడమనాడు గ్రామానికి చెందిన కేశువులు ద్విచక్రవాహనంపై సూళ్లూరుపేట రోడ్డులో శ్రీకాళహస్తికి వస్తుండగా మతకముడి రోడ్డు దగ్గర స్కూటర్ అదుపు తప్పి పడిపోవడంతో కేశువులు తలకు తీవ్ర గాయమైంది. పోలీసులకు సమచారం' ఇవ్వడంతో 108 సాయంతో శ్రీకాళహస్తి ఏరియా అసుపత్రికి తరలించారు.

యాంటీ కరెప్షన్ జిల్లా అధ్యక్షులుగా ఇస్మాయిల్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా యాంటీ కరప్షన్ ఫోరమ్ అధ్యక్షులుగా పట్టణానికి చెందిన షేక్ ఇస్మాయిల్ నియమితులయ్యారు. ప్రపంచ మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ కలాం శనివారం ఇస్మాయిల్ కు నియామక పత్రం అందించారు. సమాజంలో అవినీతిని అరికట్టేందుకు కృషి చేయాలని ఇస్మాయిల్ కు సూచించారు. మిర్జాన్ సాహెబ్, అన్ను, లాల్ బాషా, అమీర్, బషీర్ ముబారక్ పాల్గొన్నారు.

రచయిత్రి ధనాశి ఉషారాణికి ఘన సన్మానం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: స్థానిక భాకరాపేటకు చెందిన రచయిత్రి ఉషోదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ధనాశి ఉషారాణికి 56 వ గ్రంథాలయం వారోత్సవాల్లో భాగంగా వన్ గ్రంథాలయం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో ఆమెను ఘనంగా సత్కరించారు. తిరుపతిలో నిర్వహించిన గ్రంథాలయం వారోత్సవాల్లో ఆమె కవితాగానం నిర్వహించడం ఇందులో గ్రంథాలయం గురించి చక్కని పాట ద్వారా అందరినీ ఆకట్టుకున్నారు. ఇందులో విఆర్ రాసాని, సాకం నాగరాజు, హేమమాలిని, ఎంఈఓ ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయం అధికారి మైనారు మధుబాల చేతులు మీదుగా మెమెంటో ప్రశంసాపత్రం ఇచ్చి ఆమెకు సత్కారం చేశారు. వివిధ ప్రాంతాల నుండి 30 మంది కవులు ఇందులో పాలుపంచుకున్నారు. స్థానికులు, తోటి కవులు ఆమెను అభినందించారు.